క్లుప్తంగా

విధి నిర్వహణలో కార్మికుడు మృతి

మేడికొండూరు: విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యానికి గురైన ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలోని పేరేచర్లలో ఒక స్టోన్ క్రషర్‌లో మంగళవారం జరిగింది. పేరేచర్ల సమీపంలోని విజయకాటన్ కాలనీకి చెందిన పి.సుబ్బారావు(42) పేరేచర్లలోని ఒక స్టోన్ క్రషర్‌లో పనిచేస్తుంటాడు. రోజు మాదిరిగానే మంగళవారం విధులకు హాజరయ్యారు. ఒక్కసారిగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. అతనిని తోటి కార్మికులు గుంటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గుండెపోటుతో వీఆర్‌ఏ మృతి

ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి వీఆర్‌ఏ టి.గంగయ్య(58)గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ పద్మనాభుడు, రెవెన్యూ సిబ్బంది గంగయ్య కుటుంబసభ్యులను మంగళవారం పరామర్శించి ప్రభుత్వం తరుపున మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేల నగదు అందజేశారు.

వైభవంగా భద్రకాళీ సమేత వీరభద్రుడి కల్యాణం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొండవీటి రెడ్డి రాజులు పూజించిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ వార్షిక కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి ఉత్సవమూర్తులకు వేద పండితులు నారాయణం వంశీకృష్ణ, విశ్వనాథ శాస్త్రిలు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, మండపారాధన, కన్యావరుణాలు, చూర్ణిక వంటి పూజలు చేసి శాంతికల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్తలు చిట్టా వెంకటేశ్వరరెడ్డి, చిట్టా సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



మేడికొండూరు: కృషి, పట్టుదల కేంద్రీకరించి ఒక లక్ష్యం దిశగా ప్రతి క్రీడాకారుడు రాణించాలని మందపాడులోని వజ్రాల అప్పిరెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ స్థలదాత అప్పిరెడ్డి అన్నారు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ అండర్ -17 పోటీలలో గుంటూరు జిల్లా జట్టు మొదటి స్థానం సాధించింది. ఈ జట్టులో వజ్రాల అప్పిరెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాకారులు ఐదుగురు పాల్గొన్నారు. పోటీలలో అత్యంత ప్రతిభ కబరిచిన క్రీడాకారులకు మంగళవారం అభినందన సభ నిర్వహించారు. క్రీడాకారులను సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. మందపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ స్థలదాత వజ్రాల అప్పిరెడ్డి రూ.15వేలు, మరో గ్రామ పెద్ద రమణారెడ్డి రూ.5వేలు, గోపాలకృష్ణారెడ్డి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు కడియం జయరావు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి శివకేశవ నగర్‌లోని చైతన్య తపోవన్ ఆధ్వర్యంలో ఈనెల 18,19 తేదీల్లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు తపోవన్ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మెగా వైద్యశిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నామని, 18వ తేదీ ఎంజె నాయుడు హాస్పిటల్ వారిచే ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారని, అనంతరం ఉచితంగా మందులు అందజేస్తారని అన్నారు. 19వ తేదీ అయాన్ ఐ హాస్పిటల్ వారు కంటిచూపు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యం

- నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- జగనన్నది ప్రజా రంజక పాలన
- ఓర్వలేక ఎల్లో మీడియాతో కలిసి ప్రతిపక్షాల దుష్ప్రచారం
- తుళ్లూరు మండలం కన్వీనర్‌లు, గృహ సారథుల సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పక్కన సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: పార్టీలు, కుల,మతాలకతీతంగా ప్రభుత్వ ఆశయాలను, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడమే లక్ష్యంగా జగనన్న సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు పనిచేయాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం తుళ్లూరు మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులకు ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు కాని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నాయని, అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది అన్నారు. వలంటీర్ వ్యవస్థతో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించే వెసులుబాటు వచ్చిందని, గతంలో సంక్షేమం అంటే జన్మభూమి కమిటీలు, ఆయా పార్టీల నాయకుల ఇళ్ల వద్ద కనుసన్నల్లో నడిచేవన్నారు. నేడు అందుకు భిన్నంగా ప్రభుత్వ వ్యవస్థను పేదల పంచన చేర్చిన జగనన్నకు 90 శాతం మంది ప్రజలు అండగా నిలుస్తారనడంలో సందేహం లేదన్నారు. వలంటీర్ వ్యవస్థకు అనుసంధానంగా ప్రవేశపెట్టిన కన్వీనర్‌లు, గృహ సారథులు ప్రభుత్వానికి వెన్నెముక లాంటి వారని, ఇకపై ఇంటింటికీ తిరిగి ప్రజలకు వారధిగా పనిచేసి ప్రజల్లో నూరుశాతం సంతృప్తిని కలుగచేయాలని సూచించారు. జగనన్న ప్రజారంజక పాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ఎల్లో మీడియాతో కలిసి రాష్ట్రంలో దుష్ప్రచారానికి దిగడం సిగ్గుచేటని, వారి ప్రచారాలను తిప్పికొట్టి జగనన్న ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

బహుజన రాజ్యాధికారం దిశగా జగనన్న అడుగులు

బాబా సాహెబ్ అంబేడ్కర్ కలలుగన్న బహుజన రాజ్యాధికారం దిశగా ఏపీలో జగనన్న అడుగులు వేస్తున్నారనడంలో సందేహం లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేస్తూ సామాజిక విప్లవం తీసుకొచ్చిన జగనన్న అందులో మహిళలకు 50 శాతం అవకాశాలు కల్పిస్తూ అడుగులు ముందుకేస్తున్నారన్నారు. పేదవాడి ఆర్థిక, సామాజిక ఎదుగుదలను ఓర్వలేని ప్రతిపక్షాలు జగనన్నపై దుష్ప్రచారం చేస్తున్నాయని, విష ప్రచారాలకు క్లాం వేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. వలంటీర్ వ్యవస్థకు అనుసంధానంగా ప్రవేశపెట్టిన కన్వీనర్‌లు, గృహ సారథులు సమష్టిగా పనిచేసి పార్టీ ఆశయాలను కింది స్థాయికి చేర్చాలని సూచించారు. నూతనంగా నియమితులైన కన్వీనర్‌లు, గృహ సారథులకు ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇంటింటికి తిరిగి నిర్వహించాల్సిన విధులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయ మండల కన్వీనర్ బండి ప్రసాద్, పలువురు వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

– నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

ఓటరు అనుమతి లేకుండా ఆధార్ అనుసంధానం చేయొద్దు

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ హేమమాలిని

మంగళగిరి: ఓటరు అనుమతి లేకుండా ఆధార్ అనుసంధానం చేయవద్దని అడిషనల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి హేమమాలిని అన్నారు. టిప్పర్ల బజారులోని సచివాలయంలో మంగళవారం బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ బూత్ పరిధిలోని ప్రతి ఒక్క ఓటర్ ఆధార్ అనుసంధానం చేయించకుండా మిగిలిపోని విధంగా అందరూ ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అనుసంధాన ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఫాం-6బీపై ఓటరు సంతకం కచ్చితంగా ఉండాలని సూచించారు. ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనుసంధాన కార్యక్రమంలో ఏమైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ఎగ్జిక్యూటివ్ అధికారులు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని బీఎల్‌ఓలు గ్రహించాలన్నారు. బీఎల్‌ఓలు విధి నిర్వహణలో అలసత్వాన్ని వహిస్తే సహించేది లేదని, ఏవైనా అవకతవకలు తలెత్తితే సంబంధిత బీఎల్‌ఓలపై క్రమశిక్షణా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

దామోదరం సంజీవయ్య సేవలు ఎనలేనివి

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు



దామోదరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ప్రజల మనసును గెలిచిన ప్రజా నాయకుడని, ఆయన అందించిన సేవలు ఎనలేనివని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు కొనియాడారు. నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో మంగళవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మునగాల మాట్లాడుతూ సంజీవయ్య జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగ జీవితం నుంచి మొదలైన ఆయన ప్రస్థానం రాజకీయ రంగంలో ఓ ఘనుడిగా ఇనుమడించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రి వర్గాల్లో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆనాడు ఉన్న క్లిష్టమైన రాజకీయ పరిస్థితులను దాటి ఓ బలమైన వర్గాన్ని ఎదుర్కొని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా ఎదగటం సాధారణ విషయం కాదన్నారు. దళితజాతికి దామోదరం సంజీవయ్య ఒక వెలుగు జ్యోతి అని, ఆయన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంకా బాలాజీగుప్తా, ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ మాల దాసు, మాల దాసరి, మిత్తల అయ్యావార్ల హక్కుల సాధన పోరాట సమితి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇందుపల్లి రామారావు, లేళ్ల సురేష్, కూరపాటి సుబ్బారావు, గోలి సాంబశివరావు, కాకర్లమూడి దుర్గారావు, గాజుల రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లతో కంటి సమస్యలు అధికం

కేఎల్‌యూలో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న కామాక్షి ఐ కేర్ వైద్యులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో మంగళవారం హెల్ప్ ఫౌండేషన్ (సత్తెనపల్లి), కామాక్షి ఐ కేర్ (చెరుకుపల్లి) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని డీన్ డాక్టర్ సీహెచ్ హనుమంతరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లకు అలవాటు పడడం వలన కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయని అన్నారు. కామాక్షి ఐ కేర్ వైద్యులు వాసుదేవరావు మాట్లాడుతూ కంటిచూపు మందగించడానికి కారణాలు, జీవితాంతం కంటిచూపు మెరుగ్గా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. వైద్యులను సంప్రదించకుండా ఎలాంటి మందులు వాడకూడదని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, విశ్వవిద్యాలయ అసోసియేట్ డీన్ డాక్టర్ రూతు రమ్య, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, యూనివర్సిటీ యూత్ రెడ్‌క్రాస్ డాక్టర్ శివారెడ్డి, హాస్పిటల్ సిబ్బంది వనిత, సదాశివరావు, బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో అధిక మేలు



ఫిరంగిపురం: ఘనజీవామృతంతో పంటకు అధికంగా మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం స్టేట్ రీసెర్చ్ కోఆర్డినేటర్ రచిత్ తివారీ అన్నారు. మండలంలోని 113తాళ్లూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంతో పంటను పండించిన రైతుల పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం పంటలు వేసిన రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి అనుభవాలు అడిగితెలుసుకున్నారు. పంటకు రసాయనిక ఎరువులు వాడకం లేదా ప్రకృతి వ్యవసాయంలో వాడే కషాయాల వాడకంలో ఉన్న తేడాలు అడిగి తెలుసుకున్నారు. పంట వేయకముందే ఘనజీవామృతం వేయడం ద్వారా చీడపురుగులు నిర్మూలన జరిగి పంట దిగుబడికి ఎంతో ఉపకరిస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి చేకూరినట్లు పలువురు రైతులు తెలిపారు. ఆయన వెంట జిల్లా ప్రకృతి వ్యవసాయం డీఆర్పీ ఎంటీ.కుమార్, ఎస్‌డీఏ అన్నామణి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఎన్‌టీఆర్ కాలనీలో ఆదివారం రాత్రి మైనర్ బాలిక ఎస్తేరురాణిని అతి కిరాతకంగా హత్యచేసిన కుక్కల రాజును కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి ప్రాంతంలో రోజురోజుకీ మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

కుక్కల రాజు మనవాడే

- అక్కడ ధర్నా... ఇక్కడ కాపాడే ప్రయత్నం
- ఇదీ టీడీపీ నాయకుల ద్వంద్వ వైఖరి



కుక్కల రాజు(సర్కిల్‌లోని వ్యక్తి)తో ఫొటోలు దిగిన టీడీపీ యువజన నాయకులు కృష్ణకుమార్

తాడేపల్లిరూరల్ : బాలిక హత్యకేసులో నిందితుడు నాగబాబు ధనుంజయరాజు అలియాస్ కుక్కల రాజు టీడీపీకి చెందిన వ్యక్తేనని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. హత్యకు గురైన ఎస్తేరురాణికి న్యాయం చేయాలంటూ టీడీపీ మహిళా కార్యకర్తలు, నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. ఆందోళనకు దిగిన వారే నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నించడం విశేషం. రాజు అరెస్టు చూపించే సమయంలో గుండిమెడకు చెందిన టీడీపీ యువజన నాయకులు కృష్ణకుమార్ అలియాస్ చిన్ని బిర్యాని, ఇతర వస్తువులను తీసుకువచ్చి మంగళవారం అతనికి అందజేశాడు. బెయిల్ ఎన్ని రోజులకు వస్తుందంటూ పోలీసులతో మంతనాలు జరిపాడు. సోమవారం జరిగిన ఆందోళన కార్యక్రమంలో కృష్ణకుమార్ అలియాస్ చిన్ని పాల్గొని కుక్కల రాజు వైఎస్సార్‌సీపీ నాయకుల అనుచరుడు అంటూ టీడీపీ నాయకులకు చెప్పి ప్రెస్‌మీట్లు నిర్వహించాడు. విజయవాడలో నివాసముండే కుక్కల రాజు ఎన్‌టిఆర్ కట్టకు వచ్చిన దగ్గర నుంచి టీడీపీ నేతలతో సత్సంబంధాలు కలిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. ఈ మధ్య గుండిమెడలో జరిగిన గొడవలో పాల్గొని దాడికి పాల్పడ్డాడు. చివరకు కుక్కల రాజు తమ కార్యకర్తే అని నిర్ధారణ కావడంతో టీడీపీ అధినాయకులు ముందు చెప్పాలి కదా అతను మన పార్టీవాడే అని అంటూ స్థానిక నాయకులకు అక్షింతలు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. కుక్కల రాజుతో ఎవరైనా వీడియోలు గానీ, ఫొటోలు గానీ దిగి ఉంటే వాటిని వెంటనే ఇతర మాధ్యమాల్లో కనిపించకుండా చేయాలంటూ ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరిగినా టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదజల్లి చివరకు వారి పార్టీ కార్యకర్తలో, నాయకులో అవడంతో ముక్కుమీద వేలు వేసుకుని తాము చేసిన ఆందోళనలు ఫేస్‌బుక్, వాట్సప్‌లలో పెట్టుకుంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

హత్యచేసిన దగ్గర నుంచి వారి వద్దే...

కుక్కల రాజు ఎస్తేరురాణిని హత్యచేసిన వెంటనే గుండిమెడలోని కృష్ణకుమార్ వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పాడు. కృష్ణకుమార్ వెంటనే తన స్నేహితుని సహాయంతో గుండిమెడ, కుంచనపల్లి పొలాల్లో ఉన్న డొంకరోడ్లలోని ఓ షెడ్‌లో దాచిపెట్టారు. ఎప్పుడయితే బాలిక హత్య జరిగిందని తెలిసిందే వెంటనే తన అనుచరులతో ద్విచక్రవాహనం ఎక్కించి కనకదుర్గ వారధి వద్ద వదిలేయడంతో కుక్కల రాజు వారధి కింద నుంచి నడుచుకుంటూ వెళ్తూ పోలీసుల కంటపడ్డాడు. ఇంత తతంగం నడుపుతున్న టీడీపీ నాయకులు మాత్రం నిందితులకు సహాయం చేస్తూ పోలీసులను పక్కదోవ పట్టించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుడు అదృశ్యం

తెనాలి రూరల్: కార్మికుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన పసుపులేటి సుధాకర్ కూలి పనులకు వెళుతుంటాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు.

ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవచ్చు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య

మంగళగిరి: కార్మికుల ఐక్య పోరాటాలతోనే హక్కులు సాధించుకోవచ్చని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏరియా మహాసభ మార్చి 15వ తేదీన నిర్వహించాలని విస్తృత సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు కుటుంబాలు గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భవన నిర్మాణ రంగంలో సంక్షేమ చట్టం ఉన్నా దానికి సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుని కార్మికులకు మొండిచెయ్యి చూపిస్తుందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులు సాధించుకోవాలన్నారు. సీఐటీయూ నాయకులు జేవీ రాఘవులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరోనా పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వ ఇసుక విధానం, మెటీరియల్స్ ధరలు పెరగడం వల్ల పనులు ఉండటం లేదన్నారు. రాజధానుల ప్రకటన తర్వాత ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైపోతుందన్నారు. భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరువీధుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఎస్‌కే జానీబాషా, వి పూర్ణయ్య, సీహెచ్ సత్యనారాయణ, శివారెడ్డి, ఎన్ వెంకయ్య, సురేష్, శ్రీనివాసరావు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై కమలాకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు

తాడేపల్లిరూరల్: కడపలో ఈనెల 11,12 తేదీల్లో సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరిగిన ఇంటర్ జిల్లా స్థాయి పోటీల్లో తమ విశ్వవిద్యాలయ విద్యార్థులు బహుమతులు గెలుపొందారని విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విశ్వవిద్యాలయానికి చెందిన ఎస్.వేహిత్ మొదటి స్థానాన్ని, పి.సూర్య ఆకాష్ ద్వితీయ స్థానాన్ని ప్రణయ్‌రామ్ తృతీయ స్థానాన్ని సాధించారని తెలిపారు. విద్యార్థులను వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వీసీ డాక్టర్ ఎస్.వెంకటరామ్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు గాయాలు

- మద్యం మత్తులో వాహనం నడిపిన బీజేపీ నాయకుడు
- బాధితులు నందిగామ వాసులు



గాయపడ్డ వృద్ధురాలు అత్తి మంగమ్మ

తాడేపల్లిరూరల్: మద్యం మత్తులో బీజేపీ నాయకుడు అశ్రద్ధగా, అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో వృద్ధ దంపతులు గాయపడ్డారు. సేకరించిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా నందిగామకు చెందిన వృద్ధ దంపతులు అత్తి మంగమ్మ, మల్లయ్యలు తమ ద్విచక్రవాహనంపై మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నందిగామ వెళుతున్నారు. ఈ సమయంలో సులకపేట వద్దకు రాగానే మద్యం తాగిన మత్తులో బీజేపీ కాకుమాను భాగ్యేశ్వరరావు తన ద్విచక్రవాహనంతో వెనుక నుంచి ఢీ కొట్టడంతో వృద్ధ దంపతులు రోడ్డుపై పడ్డారు. ప్రమాదంలో మంగమ్మ తలకు దెబ్బ తగిలి అస్వస్థతకు గురైంది. గాయపడిన మంగమ్మను, మల్లయ్యలను 108 వాహనంలో స్థానికులు వైద్య నిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ఆక్రమణలు తొలగింపు

అమ్మకానికి పెట్టిన ఇరిగేషన్ భూమి స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్



విద్యుత్ మీటర్ తొలగిస్తున్న ఇరిగేషన్ డీఈ ప్రవీణ్

తాడేపల్లిరూరల్: ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతోపాటు అమ్మకానికి పెట్టిన వైనంపై ఆ శాఖ అధికారులు స్పందించారు. ఆక్రమణలను తొలగించి, స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్ ఒడ్డున కుంచనపల్లి వద్ద అమ్మకానికి ఇరిగేషన్ స్థలాలు అనే శీర్షికన సాక్షిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన దుగ్గిరాల డిప్యూటీ డీఈ ఎం.కె.వి.ప్రసాద్ మంగళవారం కుంచనపల్లి విచ్చేసి అమ్మకానికి అని పెట్టిన బోర్డును తొలగించి, రేకులను షెడ్డు తొలగించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఇరిగేషన్ స్థలాలు ఎవరు ఆక్రమించినా శిక్షార్హులని, అటువంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఇరిగేషన్ భూమిని అమ్మకానికి పెట్టినా సహించేది లేదని హెచ్చరించారు. స్థలం అమ్మకానికి పెట్టి ఫోన్ నెంబర్ ఏర్పాటు చేశారని, ఆ నెంబర్ ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.